క్లుప్తంగా

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు


శివుడికి అభిషేకం చేస్తున్న పూజారి సత్యనారాయణస్వామి

ఆదోని అర్బన్: పట్టణంలోని గంగాభవానీ దేవాలయంలో శనివారం ఉదయం అమావాస్య సందర్భంగా శివలింగానికి అర్చనలు, అభిషేకాలు, పూజా కార్యక్రమాలను పూజారి సత్యనారాయణస్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గంగపుత్ర సంఘం నాయకులు, భక్తులు తెలుగు ఈరన్న, ఆటో వెంకటేష్, మేఘనాథ్, దుల్లయ్య, రాయచూరు నగేష్, బ్యాంకు వీరేష్, టీచర్ రంగన్న, మోహన్ తదితరులు పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు.

బసవేశ్వర స్వామికి విశేష పూజలు


ప్రత్యేక అలంకరణలో బసవేశ్వర స్వామి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలోని బసవన్న కొండ పై వెలసిన బసవేశ్వర స్వామికి విశేష పూజలు చేపట్టారు. శనివారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ అర్చకులు ఉమేష్ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి వేకువ జామున నుంచి జలాభిషేకం, పంచామృతాభిషేకం, వెండికవచ అలంకరణ, ఆకు పూజలు గావించి మహా మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులకు ఆలయ కమిటీ సమక్షంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతానికి కృషి చేయాలి


మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డిని సత్కరిస్తున్న మాచాని వెంకటేష్

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతానికి పార్టీ శ్రేణులు, పార్టీ పదవులు పొందిన వారు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే చెన్నకేశవరెడ్డి సూచించారు. వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాచాని వెంకటేష్ శనివారం మాజీ ఎమ్మెల్యేను ఆయన నివాసంలో కలిసి పూలమాల, శాలువాతో సత్కరించారు. తనకు పార్టీలో రాష్ట్ర స్థాయి చేనేత విభాగంలో పదవి వచ్చేలా కృషి చేసిన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బుట్టారేణుక, మాజీ ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణంలోని 4వ వార్డు పార్టీ నాయకుడు నాగేంద్ర పాల్గొన్నారు.

వలస వెళ్లిన విద్యార్థులు పాఠశాలలో చేరిక


వలస వెళ్లిన పిల్లలను పాఠశాలలో నమోదు చేయిస్తున్న ఎంఈఓ-2 శోభారాణి

కోసిగి : మండల కేంద్రం కోసిగిలో హిందు గరల్స్ ప్రాథమిక పాఠశాలలో చదువుతూ.. వలస వెళ్లిన విద్యార్థులను తిరిగి పాఠశాలలో చేర్పించినట్లు హెచ్‌ఎం సంజన్న తెలిపారు. శనివారం పాఠశాలలో ఎంఈఓ-2 శోభారాణి సమక్షంలో 25 మంది పిల్లలను రీ జాయినింగ్ చేయించుకుని సీఎంఎఫ్ ఐడీ ఎంట్రీ నమోదు చేశారు. ఆమె విద్యార్థులకు తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను వలసలకు తీసుకెళ్లడంతో విద్యార్థులకు చదువులకు ఆటంకం ఏర్పడి భవిష్యత్ దెబ్బతింటుందన్నారు. పిల్లలను రెగ్యులర్‌గా పాఠశాలలకు పంపించి చదువులు చెప్పించాలని సూచించారు.

అభివృద్ధే లక్ష్యం


మున్సిపల్ శాఖ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీవీ

ఎమ్మిగనూరుటౌన్: అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం పట్టణంలో పార్టీ జెండాను ఆవిష్కరించి, సోమప్ప సర్కిల్‌లో పార్టీ శ్రేణులనుద్దేశించి మాట్లాడారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాల్లో మున్సిపల్ శాఖ ఏర్పాటు చలివేంద్రాలను మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఉగాది సందడి


ఉగాది పచ్చడికి మామిడి కాయలు కొనుగోలు చేస్తున్న మహిళ


బంతిపూలు, టెంకాయలను కొనుగోలు చేస్తున్న దృశ్యం

ఉగాది పండుగను పురస్కరించుకొని శనివారం పట్టణ, గ్రామీణ ప్రజలతో పట్టణంలోని సోమప్ప సర్కిల్‌తో పాటు పలు వ్యాపార సముదాయాలు కిటకిటలాడాయి. సోమప్ప సర్కిల్‌లో పూజలకు కావాల్సిన టెంకాయలు, బంతిపూలు, మామిడాకులు తదితర వస్తువులు, కిరాణదుకాణాల్లో సరుకుల కొనుగోళ్లతో ఆయా ప్రాంతాలు సందడిగా మారాయి. అదేవిధంగా ఉగాది పచ్చడి చేసుకునేందుకు మామిడి కాయల కొనుగోళ్లు ఊపందుకున్నాయి.

– ఎమ్మిగనూరుటౌన్

ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి


జైలులోని రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి పి.జె.సుధ

ఆదోని రూరల్: ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి. పి.జె.సుధ అన్నారు. శనివారం ఆదోనిలోని సబ్‌జైలును జడ్జి తనిఖీ చేశారు. జైలులోని ఖైదీల వివరాలను, వారికి అందుతున్న సేవలను జైలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలకు ఏదైనా సమస్య వస్తే సంబంధిత మండల న్యాయసేవాధికార సంస్థ వారిని సంప్రదించాలన్నారు. ఖైదీలకు ఉచిత న్యాయసేవల గురించి వివరించారు. కార్యక్రమంలో జైలు సూపరింటెండెంట్ నజీర్‌అహ్మద్, న్యాయవాదులు ఆనంద్ పాల్గొన్నారు.

బాలికలు చట్టాల గురించి తెలుసుకోవాలి

బాలికలు చట్టాల గురించి అవగాహన కలిగి ఉండాలని ఆదోని రెండో అదనపు జిల్లా జడ్జి పి.జె.సుధ సూచించారు. శనివారం ఆదోని పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. అమ్మాయిలు సమాజంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రేమలాంటి ప్రలోభాలకు తలొగ్గకుండా తమ విలువలను కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు హెచ్‌ఎం శివకుమార్‌స్వామి, లోకేష్‌కుమార్, బాలకృష్ణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

దర్గాలో అమావాస్య వేడుకలు


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాలో శనివారం అమావాస్య వేడుకలను భక్తులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. రంజాన్ మాసం కావడంతో భక్తులు దర్గాలోనే ఇఫ్తార్ చేశారు. తెల్లవారుజామున దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతెహాల సమర్పించారు.

అర్హత కలిగిన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలివ్వాలి

కోసిగి: అర్హత కలిగిన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కేటాయించి ఇళ్ల స్థలాలు కేటాయించాలని జర్నలిస్ట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ (జాప్) యూని యన్ జిల్లా ఉపాధ్యక్షులు విజయ్‌కుమార్, సహాయ కార్యదర్శి ఈరన్న ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం జాప్ యూనియన్ ఆధ్వర్యంలో తహసీల్దార్ రుద్రగౌడకు వినతి పత్రం అందజేశారు. వెంటనే కొత్త అక్రిడేషన్‌లు మంజూరు చేసి ఇళ్ల స్థలాలు లేని వారికి ఇళ్ల స్థలాలు కేటాయించాలని కోరారు. ఆ సంఘం నాయకులు గోపాల్, మల్లికార్జున, సిద్దు, హనుమంతు, నాగార్జున, శ్రీసు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి

ఆదోని రూరల్: సివిల్ సప్లై హమాలీలకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సివిల్ సప్లై హమాలీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.కృష్ణ, జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, సీఐటీయూ పట్టణాధ్యక్షులు తిప్పన్న డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సివిల్ సప్లై గోదాములో హమాలీల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ దసరా బోనస్, యూనిఫాం, కొత్త కూలీ రేట్లు అమలులోకి వచ్చాయన్నారు. సమావేశంలో మేస్త్రీలు నారాయణ, మల్లికార్జున, హమాలీలు రామంజి, వీరాంజి, బాబన్న, వీరేష్ పాల్గొన్నారు.

పట్టణ పారిశుధ్యానికి సహకరించాలి

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వ్యాపారులు పారిశుధ్యానికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సూచించారు. శనివారం పట్టణంలోని పార్క్ రోడ్, హాస్పిటల్ రోడ్డు, మార్కెట్ ఏరియా ప్రాంతాల్లో పారిశుధ్య పనులు పరిశీలించి వ్యాపారులు, ప్రజలతో మాట్లాడి పలు సూచనలిచ్చారు.

మున్సిపల్ కమిషనర్ విధానం మార్చుకోవాలి

ఆదోని సెంట్రల్: ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ల జారీలో మున్సిపల్ కమిషనర్ ఎం.కృష్ణ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు ఆరోపించారు. వెంటనే విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని శనివారం సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్‌ను కలిసి విన్నవించారు. ఈడబ్ల్యూఎస్ సర్టిఫికెట్ కోసం దరఖాస్తు చేసుకున్న ప్రతిఒక్క విద్యార్థికి ఇంటి పన్నుతో నీటి పన్ను క్లియర్ ఉంటేనే సంతకం చేస్తామంటూ మున్సిపల్ కమిషనర్ కృష్ణ షరతు పెట్టడం తగదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు పనులు లేక వేరే రాష్ట్రానికి వెళ్లిన పరిస్థితి ఉందన్నారు. ఎస్‌ఎఫ్‌ఐ పట్టణాధ్యక్షులు శశిధర్, సంజయ్, భరత్‌కుమార్, వీరేష్, మహేష్ పాల్గొన్నారు.

సంక్షిప్తం

మందుస్తు ఉగాది వేడుకలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని భాష్యం ఇంగ్లిష్ మీడియం హైస్కూల్లో శనివారం ప్రిన్సిపాల్ మాచాని కవిత ఆధ్వర్యంలో మందస్తు ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అలాగే రంజాన్ పండుగ శుభాకాంక్షలను తెలియచేశారు. అలాగే స్కూల్లో పనిచేసే ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.

మిర్చి రైతులను ఆదుకోవడంలో విఫలం

గోనెగండ్ల : రైతులు పండించిన మిర్చికి గిట్టుబాటు ధర కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పంపన్న గౌడ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు భాస్కర్ యాదవ్ అన్నారు. శనివారం మండల కేంద్రం గోనెగండ్లలో వారు మాట్లాడారు. రైతాంగ సమస్యల కోసం ఏప్రిల్ 4న కర్నూలులో నిర్వహిస్తున్న జాతీయ రైతు సదస్సుకు రైతులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం, సీపీఐ నాయకులు మాలిక్, శాంతన్న, నాగప్ప, గిడ్డయ్య, రాము పాల్గొన్నారు.

ఏప్రిల్ చివరి వరకు ఎల్‌ఎల్‌సీకి నీరివ్వండి

కౌతాళం: తుంగభద్ర దిగువ కాలువకు ఏప్రిల్ 30 వరకు సాగునీరు వదలాలని రైతు సంఘం నాయకులు కోరారు. శనివారం రైతు సంఘం ఆధ్వర్యంలో కాలువను సందర్శించారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య మాట్లాడుతూ ప్రస్తుతం వరి, సజ్జ, మొక్కజొన్న వంటి పంటలు పొట్టదశలో ఉన్నాయని తెలిపారు. ఏప్రిల్10కి నీరు బంద్ చేస్తే పంట దిగుబడి రాదని చేతికొచ్చిన పంట నోటికి రాకుండా నెలపాలవుతుందన్నారు.

నాయకులు బాషా, రహిమాన్, గాది, ఈరన్న, శంకర్, మహేశ్, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

ట్రూఅప్ చార్జీలు రద్దు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: ట్రూఅప్ చార్జీలను రద్దు చేసి స్మార్ట్ మీటర్లను బిగించడాన్ని మానుకోవాలని సీపీఎం నాయకులు గోవిందు, రాముడు, లక్ష్మీనర్సయ్య, సురేష్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విద్యుత్ శాఖ డివిజన్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏఈకి అందజేశారు. నాయకులు సుభాన్, నగేష్, రాఘవేంద్ర, రాజు పాల్గొన్నారు.

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళం విద్యుత్ స్టేషన్ వద్ద సీపీఎం సీనియర్ నాయకుడు మల్లయ్య , పార్టీ నాయకులతో కలిసి ఏఈ నరసన్నకు వినతి పత్రం అందజేశారు.

సీపీఐ మండల కార్యదర్శిపై కేసు నమోదు

పెద్దకడబూరు : తహసీల్దారుపై దుర్భాషలాడిన సీపీఐ మండల కార్యదర్శి వీరేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ శివరాములు తెలిపారు. ఆయన వివరాల మేరకు శనివారం తహసీల్దారు గీతాప్రియదర్శిని విధుల నిమిత్తం తహసీల్దారు కార్యాలయంలో ఉండగా వీరేష్ కార్యాలయానికి వచ్చి తహసీల్దారుతో పొజిషన్ సర్టిఫికెట్ గురించి ప్రశ్నించారన్నాడు. అయితే గీతాప్రియదర్శిని సమాధానం చెప్పినప్పటికీ వినిపించుకోకుండా దుర్భాషలాడుతూ అంతు చూస్తానని బెదిరించినట్లు తెలిపాడు. తహసీల్దారు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

హెచ్‌ఎంపై చర్యలు తీసుకోండి

పెద్దకడబూరు : మండల పరిధిలోని కల్లుకుంట ఉన్నత పాఠశాలలో ఇన్‌చార్జ్ హెచ్‌ఎంగా పని చేస్తున్న ఉసేనప్పపై చర్యలు తీసుకోవాలని ఏఐవైఎఫ్ డివిజన్ అధ్యక్షుడు జాఫర్ పటేల్, ఏఐఎస్‌ఎఫ్ మండల కార్యదర్శి షేక్షావలి డిమాండ్ చేశారు. ఆయన ఇష్టానుసారంగా వ్యవహరించడంతో విద్యార్థులు కూడా సక్రమంగా పాఠశాలలకు వెళ్లడం లేదన్నారు.

ఉరుకుందలో లక్ష పుష్పార్చన పూజలు


పూజలందుకుంటున్న ఈరన్నస్వామి

కౌతాళం: జిల్లాలో ప్రసిద్ధి చెందిన ఉరుకుంద ఈరన్న స్వామి దేవాలయంలో అమావాస్య సందర్భంగా లక్ష పుష్పార్చన పూజలు జరిపించారు. ఈ పూజల్లో పాల్గొని భక్తిని చాటుకున్నారు. అమావాస్య ఉండడంతో భక్తులు తమ ఇంటి ఇలవేల్పును దర్శించుకోవడానికి వేలాదిగా తరలిరావడంతో ఆలయ ప్రాంతాలు కిటకిటలాడాయి. స్వామి దర్శనానికి గంటకు పైగా సమయం పట్టింది. భక్తులకు విశిష్ట దర్శనం, ప్రత్యేక దర్శనం, శ్రీఘ్ర దర్శనం, ఉచిత, వీఐపి దర్శనాల ద్వారా దర్శనానికి పంపారు. అలాగే మండలంలోని బుడుములదొడ్డి ఆంజినేయస్వామి ఆలయంలో, తుంగభద్ర నది ఒడ్డున మేళిగనూరు గ్రామంలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో అమావాస్య వేడుకలు జరిగాయి.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు

నందవరం : విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఎంపీడీఓ పుల్లయ్య అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌ను తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, తాగునీరు, డైనింగ్ హాల్, హాస్టల్ పరిశుభ్రతను పరిశీలించారు. హాస్టల్‌లోని వసతులను వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలన్నారు. సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈఓపీఆర్డీ సందీప్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు


ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డికి పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలుపుతున్న పి. వెంకటేష్

కోసిగి: వైఎస్సార్ సీపీ వలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి. వెంకటేష్ శనివారం ఎమ్మెల్యే స్వగృహం రాంపురం గ్రామంలో ఎమ్మెల్యే వై. బాలనాగిరెడ్డి, టీటీడీ మాజీ పాలక మండల సభ్యుడు వై. సీతారామిరెడ్డి, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వై.ప్రదీప్ రెడ్డి, యువనాయకులు వై. ధరణీధర్ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి పి. మురళీ మోహన్ రెడ్డిలను ఎంపీపీ ఈరన్నతో కలిసి శాలువా పూలమాలలు వేసి కృతజ్ఞతలు తెలిపారు. తనకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడం చాల సంతోషకరంగా ఉందన్నారు. రాంపురం రెడ్డి సోదరుల నా పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పార్టీ కోసం శాయశక్తులు పనిచేస్తానన్నారు. కోసిగి కడపాళెం నాయకులు పాల్గొన్నారు.

సమస్యలు పట్టించుకోకపోతే ఎలా?


కౌన్సిల్‌ను బాయ్‌కట్ చేసి బయటకు వస్తున్న వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు

ఆదోని టౌన్: వార్డుల్లో అభివృద్ధి పనులు చేయాలని తాము ఐదారు నెలలుగా కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చినా పెడచెవిన పెడుతున్నారని వైఎస్సార్‌సీపీ మున్సిపల్ కౌన్సిలర్లు అధికారులను నిలదీశారు. ఆదోని మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ బోయ శాంత ఆధ్వర్యంలో నిర్వహించారు. అజెండాలో మొత్తం 20 అంశాలు ఉన్నాయని, 20 సమస్యలను పొందుపరిచారని, అందులో 5, 7, 8, 9, 10 అంశాలకు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. అంతలో వైస్ చైర్మన్ నరసింహులు, కౌన్సిలర్లు సందీప్‌రెడ్డి, రాజేశ్వరరెడ్డి మాట్లాడుతూ వార్డుల్లో పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడంలేదు.. పనులు బిల్లులు కావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలు పరిష్కరించనందుకు నిరసనగా 34 మంది వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు కౌన్సిల్ సమావేశాన్ని బైకాట్ చేశారు. దీంతో చైర్‌పర్సన్ శాంత, కమిషనర్ ఎం.కృష్ణ సమావేశాన్ని వాయిదా వేశారు. త్వరలోనే మరలా నిర్వహిస్తామని సమాధానంగా చెప్పారు.

హెల్మెట్ భారం కాదు.. భద్రత


హెల్మెట్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ విజయభాస్కర్

గోనెగండ్ల : ద్విచక్రవాహన చోదకులకు హెల్మెట్ భారం కాదని ప్రాణ రక్షణ అనే విషయాన్ని మరువరాదని సీఐ విజయభాస్కర్ అన్నారు. శనివారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో హెల్మెట్ వాడకంపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపి ప్రమాదాల బారినపడి ప్రాణాలు పోగొట్టుకుంటున్నారన్నారు. హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. అలాగే రోడ్డు భద్రత గురించి, మద్యం తాగి వాహనాలు నడపరాదని, అతివేగంగా వెళ్లారాదని సూచించారు.

రంజాన్ కిట్ల పంపిణీ


రంజాన్ కిట్లను అందజేస్తున్న ఆల్‌ఫ్రెడ్‌రాజు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో ఎస్‌డీపీఐ ఆధ్వర్యంలో స్థానిక ఖురేషి ఫంక్షన్ హల్‌లో శనివారం నిరుపేద ముస్లింలకు రంజాన్ తోఫా కిట్లను ఎస్‌డీపీఐ పట్టణ అధ్యక్షుడు హుసేన్‌బాషా, మల్లెల గ్రూప్ అధినేత మల్లెల ఆల్‌ఫ్రెడ్‌రాజు, కౌన్సిలర్ దయాసాగర్ అందజేశారు. 500ల మందికి ఈ కిట్స్ పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రషీదుల్లా, ఎస్‌డీపీఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ షకూర్, ఉపాధ్యక్షుడు జహీర్ తదితరులు పాల్గొన్నారు.

వరల్డ్ టాప్ సైంటిస్టుల్లో చోటు


అధ్యాపకుడు డాక్టర్ కె. రఘునాథ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్

ఎమ్మిగనూరురూరల్: మండల పరిధిలోని ఎర్రకోట సెయింట్ జాన్స్ ఇంజినీరింగ్, టెక్నాలజీ కాలేజీలో గణిత అధ్యాపకుడు డాక్టర్ కె. రఘునాథ్‌కు అమెరికాలోని ప్రముఖ స్టాండ్ ఫర్ యూనివర్సిటీ, ఎల్స్‌వేర్ విడుదల చేసిన టాప్ 2 శాతం సైంటిస్టుల్లో చోటు లభించింది. ఈ మేరకు శనివారం కాలేజీలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె. సుధాకర్ గణిత అధ్యాపకుడిని అభినందించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కె. రఘునాథ్ ఇప్పటి వరకు దాదాపు 70కి పైగా అంతర్జాతీ స్థాయిలో పరిశోధన పత్రాలను, 25 జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కాన్ఫరెన్స్‌లో పరిశోధన పత్రాలను సమర్పించినట్లు చెప్పారు.

జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయండి

ఎమ్మిగనూరుటౌన్: వచ్చే నెల 4వ తేదీన జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పంపణ్ణ గౌడ్ పిలుపునిచ్చారు. రైతు సదస్సు విజయవంతం చేయాలని కోరుతూ చేపట్టిన జీపు జాతాను శనివారం పట్టణంలోని సోమప్ప సర్కిల్‌లో నిర్వహించారు. రైతులు అధిక సంఖ్యలో సదస్సుకు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆసంఘ నాయకులు కేసీ జబ్బార్, మాలిక్, శాంతప్ప, గిడ్డయ్య, దాదా వలి తదితరులు పాల్గొన్నారు.

పెద్దకడబూరు : ఏప్రిల్ 4వ తేదీన కర్నూలులో జరిగే జాతీయ రైతు సదస్సును జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి, కార్యవర్గసభ్యుడు పంపన్నగౌడ్, భాస్కర్‌యాదవ్ అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో రైతుసంఘం ఆధ్వర్యంలో శనివారం జీపుజాతాను ప్రారంభించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు వీరేష్, మబ్బు ఆంజనేయ, దస్తగిరి, రైతులు పాల్గొన్నారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలి

ఆదోని అర్బన్: వాహనాలు నడిపే వారు అప్రమత్తంగా ఉండాలని త్రీటౌన్ సీఐ రామలింగయ్య సూచించారు. శనివారం సాయంత్రం ఆయన బసవేశ్వర సర్కిల్ వద్ద ప్రమాద రహిత దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. వాహనదారులకు రోడ్డు భద్రతా నియమాలను వివరించారు. మోటార్ సైకిళ్లపై ప్రయాణించే వారు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించాలన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడుపరాదు

పెద్దకడబూరు : మద్యం సేవించి వాహనాలు నడపడం చట్టరిత్యా నేరమని ఏఎస్ఐ శివరాములు అన్నారు. మండల పరిధిలోని తారాపురం గ్రామంలో శనివారం ట్రాఫిక్ నియమాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిమితికి మించి ఆటోలలో, ద్విచక్ర వాహనాలలో వెళ్ల డం మంచిది కాదన్నారు.

వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధికి సన్మానం


గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డిని సత్కరిస్తున్న పార్టీ శ్రేణులు

ఎమ్మిగనూరుటౌన్: వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా నియమితులైన కె.గడ్డం లక్ష్మీనారాయణ రెడ్డిని శనివారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో పలు గ్రామాల నాయకులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు గడ్డం అంజి, గురువయ్య మాబ్బాషా, లతారెడ్డి, పామయ్య, నరసింహులు, ఫయాజ్, కడిమెట్ల నాగార్జున రెడ్డి, జగ్గాపురం రాజు, వీరేష్, ఈరన్నలతో పాటు మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్, షరీఫ్, రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అలాగే స్థానిక పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీ యూత్ నాయకుడు, పార్టీ ఇన్‌చార్జ్ బుట్టారేణుక తనయుడు బుట్టా ప్రతుల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఉపాధ్యాయులు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని ఎస్టీయూ కార్యాలయంలో శనివారం ఆ సంఘం నాయకులు ముస్లిం ఉపాధ్యాయులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకులు అడివన్న, వెంకటేశ్వర్లు మాట్లాడారు. అన్ని కులాలు, మతాల సంస్కృతులను గౌరవిస్తూ ప్రతి ఏటా ఇఫ్తార్‌విందు, సంక్రాంతి పండుగలకు ముగ్గుల పోటీలు, క్రిస్మస్ పండుగకు క్యాండిలైట్ లాంటి కార్యక్రమాలను ఎస్టీయూ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా రంజాన్ పండుగ విశిష్టతను మత పెద్దలు వివరించారు.